ప్రజాశక్తి
శుక్రవారం 15 మార్చి 2024
5
కర్నూలు



హైకోర్టుకు అడుగులు పడతాయి

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి - రూ.1000 కోట్లతో న్యాయ విశ్వవిద్యాలయానికి భూమి పూజ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం ఈ ప్రాంతంలోనే హైకోర్టు ఉండాలనేది నిర్ణయించారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి నుండి హైకోర్టుకు అడుగులు పడేలా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. గురువారం కర్నూలు నగర శివారులలోని జగన్నాథ గట్టు సమీపంలో 150 ఎకరాల్లో రూ.1,011 కోట్లతో నిర్మించనున్న నేషనల్ లా యూనివర్సిటీకి సిఎం జగన్మోహన్ రెడ్డి భూమి పూజ చేశారు. అలాగే వర్సిటీ భూమి పూజ సందర్భంగా పైలాన్ ను సిఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో, రాయలసీమలో, అందులోనూ కర్నూలులో నేషనల్ లా యూనివర్సిటీకి మనం శంకుస్థాపన చేస్తున్నామన్నారు. ఈ కర్నూలు ప్రాంతానికి, మరీ ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి ఈ కార్యక్రమం ఎంతో భవిష్యత్ ఉన్న కార్యక్రమం అంటే... మనం మొదట నుంచి చెబుతున్నాం డీసెంట్రలైజ్డ్ గవర్నెన్స్ అనేది మనముఖ్య ఉద్దేశమన్నారు. శ్రీబాగ్ ఒడంబడిక నుంచి రాయలసీమ ప్రాంతాలకు 1937లో... అంటే 87 సంవత్సరాల కిందట ఈ ప్రాంత ప్రజలకు సహేతుకమైన న్యాయం జరిగేటట్టుగా ఆ శ్రీబాగ్ ఒప్పందం కుదిరిందన్నారు. అప్పటి నుంచి ఈ ప్రాంత ప్రజలు కూడా ఎప్పటి నుంచో దీని కోసం వేచి చూస్తున్నారన్నారు. ఇక్కడ నేషనల్ లా యూనివర్సిటీకి శంకుస్థాపన చేస్తున్నామని, ఈ నేషనల్ లా యూనివర్సిటీ అన్నది ఇక్కడ రావడం, ఈ నేషనల్ లా యూనివర్సిటీ రాబోయే రోజుల్లో ఒక మంచి హైకోర్టు భవనాన్ని కూడా ఇక్కడే హౌస్ చేయగలిగిన కెపాసిటీతో ఉన్న వ్యవస్థ కూడా అవుతుందన్నారు. దీని కోసం రూ.1000 కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు. న్యాయ విభాగాలైన స్టేట్ కన్జూమర్స్ డిస్ప్యూట్, అండ్ అండ్ రిడ్రసల్ కమిషన్‌ను, ఎపి లీగల్ మెట్రాలజీ కమిషన్‌ను, ఎపి లేబర్ కమిషన్‌ను, ఎపి వ్యాట్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను, ఎపి వక్ఫ్ బోర్డును, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త కార్యాలయాలను, అదే రకంగా ఎస్‌హెచ్‌ఆర్‌సి కార్యాలయాలు కూడా మన కర్నూలులో ఏర్పాటు కానున్నాయన్నాయని చెప్పడానికి చాలా సంతోషపడుతున్నానన్నారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ రాయలసీమ ఆకాంక్షకు ప్రతీక అయిన జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం శంకుస్థాపన వచ్చిని రాష్ట్రముఖ్యమంత్రికి కర్నూలు జిల్లా ప్రజలందరి తరపున స్వాగతం తెలిపారు. అదే విధంగా ఈ కార్యక్రమాన్ని ఆశీర్వదించడానికి విచ్చేసిన మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ మాంధాత సీతారామమూర్తి, లోకాయుక్త చీఫ్ జస్టిస్ పి. లక్ష్మణ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సుమారు 150 ఎకరాల్లో స్థాపితం అవ్వబోతున్న న్యాయ విశ్వవిద్యాలయం రాయలసీమ ప్రాంత అభివద్ధిలో ఒక మచ్చు తునకగా ఉండబోతుందని తెలియజేయటానికి సంతోషిస్తున్నానని కలెక్టర్ తెలిపారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ మంత్రి సూచనలతో న్యాయ విశ్వవిద్యాలయం పనులు నిర్విఘ్నంగా జరుగుతాయని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి, మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ మాంధాత సీతారామమూర్తి, లోకాయుక్త చీఫ్ జస్టిస్ పి.లక్ష్మణ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ న్యాయ శాఖ కార్యదర్శి జి.సత్య ప్రభాకర్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హఫీజ్ ఖాన్, కంగాటి శ్రీదేవి, చెన్నకేశవరెడ్డి, సుధాకర్, మేయర్ బివై.రామయ్య, జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ విజయ మనోహర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ బుట్టా రేణుక తదితరులు పాల్గొన్నారు.


న్యాయ విశ్వవిద్యాలయం భూమిపూజలో పాల్గొన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

రెండో జాబితాలో ముగ్గురు

- అభ్యర్థులను ఖరారు చేసిన టిడిపి
- ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందికొట్కూరు అభ్యర్థుల ఖరారు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఇప్పటికే తమ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేసిన టిడిపి తాజాగా రెండో జాబితాను విడుదల చేసింది. గురువారం ఆ పార్టీ కార్యాలయం నుంచి రెండో జాబితాను విడుదల చేశారు. ఆ జాబితాలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ముగ్గురు అభ్యర్థులను ఖరారు చేశారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందికొట్కూరు అభ్యర్థులను ప్రకటించారు. ఎమ్మిగనూరు టిడిపి అభ్యర్థిగా డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి, మంత్రాలయం టిడిపి అభ్యర్థిగా నల్లగౌని రాఘవేంద్ర రెడ్డి, నందికొట్కూరు టిడిపి అభ్యర్థిగా గిత్తా జయసూర్య పేర్లను ప్రకటించారు. ఎమ్మిగనూరు, నందికొట్కూరులో ముందు నుంచి అనుకున్న వారికే టికెట్లు కేటాయించారు. మంత్రాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి పేరును ఖరారు చేస్తారని అనుకున్నా అనూహ్యంగా రాఘవేంద్రా రెడ్డి పేరును ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. తిక్కారెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని ఆయన అనుచరులు ఎదురు చూస్తున్నారు.


డాక్టర్ బీవీ
రాఘవేంద్రారెడ్డి
జయసూర్య

ఆ స్థానాలపై ఉత్కంఠ

టిడిపి తొలి జాబితాలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి తొమ్మిది అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆళ్లగడ్డ, బనగానపల్లె, కర్నూలు, కోడుమూరు, పాణ్యం, నంద్యాల, శ్రీశైలం, డోన్, పత్తికొండ అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను తొలి జాబితాలోనే ఖరారు చేశారు. రెండో జాబితాలో ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందికొట్కూరు అభ్యర్థులను ప్రకటించారు. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా ఇప్పటి వరకు 12 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆదోని, ఆలూరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. దీంతో ఆ రెండు స్థానాలపై ఉత్కంఠ నెలకొంది. టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీగా కోట్ల సుజాతమ్మ ఉండగా ఇప్పటికే డోన్ టిడిపి అభ్యర్థిగా కోట్ల జయసూర్య ప్రకాష్ పేరును ఖరారు చేశారు. కుటుంబానికి ఒకే టికెట్ కేటాయిస్తామని ఆ పార్టీ అధినేత చెప్పడంతో ఆలూరు టికెట్ ఎవరికి దక్కేనో అని అందరూ ఎదురుచూస్తున్నారు. టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా ఆదోని స్థానాన్ని బిజెపికి కేటాయించనున్నట్లు ప్రచారం సాగుతోంది.

ఇబిసి నేస్తం కింద రూ.10.41 కోట్లు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వైఎస్ఆర్ ఇబిసి నేస్తం మూడవ విడత ద్వారా జిల్లాలోని 6,944 మంది అర్హులైన మహిళా లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.10.41 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్ రావు తెలిపారు. గురువారం ఇబిసి నేస్తానికి సంబంధించిన ఆర్థిక సాయం నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. మూడవ విడత ద్వారా 6,944 మందికి సంబంధించిన రూ.10.41 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేసిన జిల్లా రెవెన్యూ అధికారితో పాటు, ఇడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జిడి.కల్పన, బిసి కార్పొరేషన్ ఎఇఒ జాకీర్ హుస్సేన్ లబ్ధిదారులకు అందజేశారు.



చెక్కును అందజేస్తున్న డిఆర్ఓ మధుసూదన్ రావు

సిఎంకు ఘనంగా స్వాగతం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జగన్నాథగట్టుపై నిర్మిస్తున్న జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఓర్వకల్లు ఎయిర్ పోర్టు నుంచి జగన్నాథగట్టుపై ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు ఉదయం 9:57 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేరుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికి రాష్ట్రఆర్థిక శాఖ మంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, రాష్ట్రమానవ హక్కుల కమిషన్ సభ్యులు జి.శ్రీనివాసరావు, జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్, ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, డాక్టర్ సుధాకర్, ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి, కంగాటి శ్రీదేవి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కుడాఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, నగర మేయర్ బివై.రామయ్య, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ విజయ మనోహరిలు ఉన్నారు. వీరితోపాటు గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్, మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ శిరోమణి మద్దయ్య, గోశాల ఛైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి, ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బి.విరుపాక్షి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ సాయినాథ్, మాజీ శాసనసభ్యులు ఎస్వీ.మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, వైఎస్ఆర్ లీగల్ సెల్ అధ్యక్షుడు సువర్ణ రెడ్డి స్వాగతం పలికారు. తిరుగు ప్రయాణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డికి వీడ్కోలు పలికారు.


జగన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సృజన, ఎమ్మెల్యేలు కాటసాని, హాఫీజ్‌ఖాన్

మోడీ ప్రభుత్వాన్ని సాగనంపండి : ప్రభాకర్‌రెడ్డి

- కలెక్టరేట్ ఎదుట రైతు కార్మిక సంఘాల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రైతు వ్యతిరేక మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కిషాన్ మోర్చా నాయకత్వంలో ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో జరుగుతున్న మహా పంచాయత్ కార్యక్రమానికి మద్దతుగా రైతు, కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వంలో కర్నూలు జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిఐటియు,ఎఐటియుసి నగర కార్యదర్శి లు విజయ్, చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీని మోడీ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. గత సంవత్సరం 375 రోజులు జరిగిన రైతు మహా ఉద్యమం సందర్భంగా రైతులకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర చట్టాన్ని తెస్తానని హామీ ఇచ్చిందన్నారు. రైతు ఉద్యమంలో దాదాపు 770 మంది రైతులు మరణించారని, మరణించిన రైతు కుటుంబాలను ఆదుకుంటానని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటివరకు హామీ నెరవేరులేదని దుయ్యబట్టారు. రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమైందన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయలేదని పేర్కొన్నారు. రైతు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి , ఆ పార్టీకి మద్దతు ఇచ్చే పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని వారు కోరారు. సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఎండి.అంజిబాబు, మునెప్ప మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత చట్టాలనే అమలు చేయాలని కోరారు.కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించాలన్నారు. సంవత్సరంలో 200 రోజులు పని దినాలు కల్పించాలని రోజుకు కనీస వేతనం రూ.600 ఉండాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న, సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, సిఐటియు సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, వెంకటస్వామి, సిఐటియు నగర కార్యదర్శి సాయిబాబా, కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు కృష్ణ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నగర అధ్యక్షులు రామాంజనేయులు, సిఐటియు నగర నాయకులు సుధాకర ప్పా తదితరులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి


కర్నూలు కలెక్టరేట్ ఎదుట సర్పంచుల ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

జగన్మోహన్ రెడ్డిని ఓడించండి

పంచాయతీరాజ్ ఛాంబర్ , సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని ఎపి పంచాయతీ రాజ్ చాంబర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి.రాజేంద్రప్రసాద్ అన్నారు. పంచాయతీరాజ్ ఛాంబర్ అసోసియేషన్ , సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైవిబి. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి మానిధులు, అధికారాలను, విధులను దొంగిలించి వేసినారన్నారు. 12,918 గ్రామాలలోని రూ 3 కోట్ల 50 లక్షల మంది గ్రామీణ ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, తాము స్థానిక ప్రజాప్రతినిధులం ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయామన్నారు. అందుకే మళ్లీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పల్లెలు శిథిలమైపోయి, గ్రామీణ ప్రజలు నాశనమైపోతారన్నారు. స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులను వాటికే తిరిగి కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లెనిన్, కార్యదర్శి భూమా వెంకట వేణుగోపాల్ రెడ్డి, సహాయ కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.


వ్యవసాయ మ్యాగజైన్‌ను విడుదల చేస్తున్న ఎఒ మల్లేష్ కుమార్ , రైతులు

వ్యవసాయ మ్యాగజైన్ పై అవగాహన

ప్రజాశక్తి -సి బెళగల్

మండలంలోని సంఘాల, చింతమాను పల్లె గ్రామాల్లో వ్యవసాయం మ్యాగజైన్ పై ఏఓ మల్లేష్ కుమార్ గురువారం రైతులకు అవగాహన కల్పించారు. నెలకు రూ.25 ప్రకారం చెల్లిస్తే ప్రతి రైతుకు మ్యాగజైన్ పోస్టు ద్వారా ఇంటికి వస్తుందని, అనేకం ఉచిత సలహాలు అందుకోవచ్చుని అన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాలు తనిఖీ చేసి రైతులకు అందుబాటులోనుండాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సంధ్య, వెంకటేష్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

సిఎఎ చట్టం రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధం

ప్రజాశక్తి-కర్నూలు కార్పోరేషన్

నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం సిఎఎ అమలు కోసం నిబంధనలు ప్రకటించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగ విరుద్ధమైన దేశ సమైక్యతకు ప్రమాదకరమైన రీతిలో ప్రకటించిన సిఎఎ నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిఎఎ చట్టాన్ని ప్రజా ధర్నాల వల్ల ఐదేళ్లపాటు మూలనబెట్టి ఇప్పుడు కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుండగా దాని అమలు పరిచేందుకు ప్రయత్నం చేయడం బిజెపి స్పష్టంగా ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు ఆడుతున్న నాటకమని తెలిపారు. దీనివల్ల దేశంలో ఉద్యమాలు పెరుగుతున్నాయి. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాల్లో అశాంతి నెలకొనే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కుల, మత ప్రాంతీయ, భాష భేదాలకు అతీతంగా దేశ పౌరులందరూ చట్టంముందు సమానమే అని చెబుతున్న భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఈ చట్టంతో దేశంలో ముస్లిం ప్రజానీకం పట్ల తీవ్రమైన వివక్షతకు గురి చేస్తుందని తెలిపారు. దీని వల్ల దేశంలోనే ముస్లిం ప్రజలకే కాకుండా హిందువులు ఇతర ప్రజానీకానికి కూడా నష్టం జరిగే అవకాశం ఉంటుందన్నారు. 1955 పౌరసత్వంలో కొన్ని సవరణలు చేసి ఈ పౌరసత్వ సవరణ చట్టం (2019) బిజెపి తీసుకోవచ్చిందని తెలిపారు. రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధమైనదని, రాజ్యాంగంలోని ఐదవ అధికరణ నుండి 11 అధికరణ వరకు పౌరసత్వం గురించిన విధివిధానాలు నిర్దేశించారన్నారు. వాటి ఆధారంగా వచ్చిందే 1955 పౌరసత్వ చట్టం అని ఆయన తెలిపారు. పౌరసత్వ సవరణ చట్టం ఈ దేశంలోని ముస్లింల సమస్య కాదు. దేశ రాజ్యాంగానికి లౌకిక ప్రజాస్వామ్యానికి ముంచుకొస్తున్న ప్రమాదమని తెలిపారు. లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగ స్థానంలో హిందూ రాష్ట్ర ఏర్పాటుకు ఆర్ఎస్ఎస్ బిజెపి వాళ్లు చేస్తున్న ప్రయత్నాల్లో నాడు బాబ్రీ మసీద్ కూల్చివేత, నేడు జమ్మూకాశ్మీర్‌ను చీల్చడం, 370 అధికరణను రద్దు చేయడం, పౌరసత్వాలను చట్టాన్ని తేవడం అందులో భాగమేననితెలిపారు. అందుకోసమే దేశ ప్రజలందరూ మతాలకతీతంగా ఏకమై సిఎఎ అమలును అడ్డుకోవాలన్నారు. అందులో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు జమ్మి చెట్టు నుండి నిర్వహించే ప్రదర్శనలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని గౌస్‌శాయ్ విజ్ఞప్తి చేశారు.

17న నాగలి కూడా ఆయుధమే..

పుస్తక పరిచయ సభ

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్ :ప్రముఖకవి కొమ్మవరపు విల్సన్‌రావు కవితా సంపుటి నాగలికూడా ఆయుధమే కవిత్వపరిచయసభ 17 మార్చి 2024 ఆదివారం ఉ.10.30కు నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఆవులబసప్ప ఆవులచక్రపాణియాదవ్ లు తెలిపారు. టీజీవి కళాక్షేత్రం సి క్యాంప్ వేదికగా జరిగే ఈ సభకు సభాధ్యక్షులుగా జంధ్యాల రఘుబాబు, ముఖ్య అతిథిగా హైదరాబాద్ కు చెందిన ప్రముఖరచయిత, సిటీకాలేజ్ తెలుగు శాఖాధిపతి డాక్టర్ కోయికోటేశ్వరరావు, విశిష్ట అతిథిగా కేంద్రసాహిత్యఅకాడమీ యువపురస్కార గ్రహీత తగుళ్ళగోపాల్ పాల్గొంటారన్నారు.ఆత్మీయ వాక్యాలు సాహితీస్రవంతి రాష్ట్రఅధ్యక్షులు కెంగారమోహన్, కథారచయితలు డాక్టర్‌పేరం ఇందిరాదేవి, మారుతీ పౌరోహితంలు అందిస్తారన్నారు. సభకు కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

కిడ్నీల ఆరోగ్యం పై అవగాహన పెంచుకోవాలి

జిజిహెచ్ నుంచి రాజవిహార్ మీదుగా కలెక్టరేట్ వరకు కిడ్నీ డే రన్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతి ఒక్కరూ కిడ్నీల ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని జిజిహెచ్ సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ వి వెంకట రంగారెడ్డి అన్నారు. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రపంచ కిడ్నీ డే (ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం) ను పురస్కరించుకొని కిడ్నీల ఆరోగ్యంపై కిడ్నీ రన్ ను వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు కలసి ఆసుపత్రి ఆవరణ నుండి రాజ్ విహార్ సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు నిర్వహించారు. ఈ కిడ్నీ డే రన్ ను సూపర్డెంట్ డాక్టర్ వి వెంకట రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా కిడ్నీల ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిజి హెచ్ అండ్ కెఎంసి నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆధ్వర్యంలో నగరంలో కిడ్నీరన్ నిర్వహించామన్నారు. దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి (సికెడి) గురించి అవగాహన పెంచడానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ సమస్యను ఎదుర్కోవడండలో ప్రజలందరి భాగస్వామ్యన్ని పెంచడానికి ఇదో మంచి ముందడుగని అన్నారు. కిడ్నీ అనేది మన అవయవాలలో ముఖ్య భాగమని శరీరంలో ఎటువంటి చెడు పదార్థాలను బహిర్గతం చేయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. కిడ్నీ అనేది ముఖ్యంగా మూడు జబ్బులకు ప్రమాదం గురయ్యే అవకాశం ఉందని, మొదటిది హైపర్‌టెన్షన్, రెండు డయాబెటిస్, మూడు ఒబేసిటీ, ఈ వ్యాధిని నిరోధించడానికి రెగ్యులర్‌గా బిపి కంట్రోల్ చేయడానికి , స్థూలకాయం అదుపులో ఉండడానికి ప్రతి ఒక్కరూ ఉదయాన్నే వ్యాయామం తప్పనిసరిగా చేయాలని అన్నారు. ఆహార నియమాఉ పాటించారు. ఈ కార్యక్రమంలో నెఫ్రాలజిస్టు విభాగపు వైద్యులు డాక్టర్ జిక్కి, డాక్టర్ ఆనంత్, డాక్టర్ వెంకటపక్కి రెడ్డి, డాక్టర్ శ్రీధర్ శర్మ, యూరాలజీ హెచ్ఒడి డాక్టర్ సీతారామయ్య, ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నగాంజన్, నర్సింగ్ సూపరింటెండెంట్ జి1 వెంకతులసమ్మ, వైద్యులు , నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.




జర్నలిస్టులకు క్యాపులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

జర్నలిస్టులకు టోపీలు పంపిణీ

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కలెక్టర్ కార్యాలయంలోని సమాచార కార్యాలయంలో జర్నలిస్టులకు టోపీలను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ఉష్ణతీవ్రత ఎక్కువగా ఉంటుందని ఏప్రిల్ నెలలో ఎండలో 40 డిగ్రీలకు చేరువయ్యే అవకాశం ఉందని ద్రోని, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో పాటు పొగ మంచు కురవడం కారణమన్నారు. ఈ ఏడాది రాయలసీమలో ఉష్ణోగ్రతలు సాధారణంగా అంటే 3-5 డిగ్రీలు అధికంగా రికార్డు అయ్యాయన్నారు. అనంతరం ఆయన జర్నలిస్టులకు టోపీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మీసాల రామస్వామి . భూర్రానుద్దీన్, వెంకటేష్, రమేష్, చెన్నయ్య, సురేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు



ఉచిత కిడ్నీస్క్రీనింగ్ క్యాంపు విజయవంతం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జేమ్ కేర్ కామినేని హాస్పిటల్‌లో ఉచిత కిడ్నీ స్క్రీనింగ్ క్యాంపు విజయవంతమైంది. అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలోని జేమ్ కేర్ కామినేని హాస్పిటల్‌లో గురువారం ఉదయం 9 నుంచి 4 గంటల వరకు ఉచిత కిడ్నీ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపులో సిబిపి, ఆర్‌బిఎస్, సీరం క్రియాటినిన్ , సియుఇ ,నెఫ్రాలజిస్ట్ కన్సల్టేషన్, ఫిజీషియన్ కన్సల్టేషన్ ఉచితంగా చేశారు. దాదాపు 500 మంది క్యాంపు ద్వారా చికిత్స పొందారు. జేమ్ కేర్ కామినేని హాస్పిటల్‌లో దీర్ఘకాలికమైన కిడ్నీ వ్యాధికి చికిత్స పొంది నయమైన రోగులు హాస్పిటల్ వైద్యులుకు వైద్యులు నయమైన రోగులకు సన్మానం చేశారు. దీర్ఘకాలికమైన కిడ్నీ వ్యాధితో నయమైన రోగులకు ఫుడ్ కౌన్సెలింగ్ ఇచ్చారు. జేమ్ కేర్ కామినేని హాస్పిటల్ ఎండి,సిఇఒ డాక్టర్ చంద్రశేఖర్, నెఫ్రాలజిస్ట్ నిపుణులు డాక్టర్ రవికుమార్ మహంకాళి మాట్లాడుతూ అంతర్జాతీయ కిడ్నీదినోత్సవం సందర్భంగా ఉచిత కిడ్నీక్యాంపునకు విశేష స్పందన వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈనెల 15 నుంచి 31వరకు రూ.3199 విలువ చేస్తే కిడ్నీ పరీక్షలను కేవలం రూ.599 చికిత్స చేస్తామన్నారు.

బాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు : బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబు సాధ్యమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా పట్టణంలోని 17వ వార్డు శక్తి నగర్‌లో 3వ రోజూ పర్యటించారు. ఎన్నికల ముందు కనిపించిన అధికార వైసిపి నాయకులు మళ్లీ ఎన్నికలు వచ్చే వరకు కనపడ్డారా అని ప్రతి ఒక్కరినీ అడుగుతూ ముందుకు సాగారు. గతంలో అధికారంలోకి రాకముందు 'నేను ఉన్నాను. నేను చూసాను. నేను విన్నాను' అని జగన్‌రెడ్డి చెప్పారని, తీరా అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అరాచకాలు, దౌర్జన్యాలు జరుగుతున్నా ఎక్కడ ఉన్నావ్ జగన్ రెడ్డి అంటూ ప్రశ్నించారు. రానున్న రోజుల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు అమలు చేసే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ ముందుకు సాగారు.

మహిళాభివృద్ధే వైసిపి ధ్యేయం : ఎంపిపి

ప్రజాశక్తి - పెద్దకడబూరు


చెక్కును అందజేస్తున్న నాయకులు

మహిళాభివృద్ధే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి శ్రీవిద్య, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం పెద్దకడబూరు ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో వైఎస్ఆర్ చేయూత, ఆసరా మెగా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేద మహిళలకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చారని తెలిపారు. వైఎస్ఆర్ చేయూత ద్వారా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 3,399 మంది మహిళల వ్యక్తిగత ఖాతాలకు ఒక్కొక్కరికి రూ.18,500 చొప్పున రూ.6.37 కోట్లు జమచేశారని చెప్పారు. ఆసరా కింద 686 గ్రూపులకు రూ.10.73 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎంపిడిఒ జనార్ధన్, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ బి.చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిపి రఘురాం, ఐకెపి ఏరియా కోఆర్డినేటర్ జనార్ధన్, వైసిపి నాయకులు రవిచంద్రారెడ్డి, సర్పంచి రామాంజనేయులు, ముక్కరన్న, అర్లప్ప పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం

- కార్మిక శాఖ సహాయ కమిషనర్ రమణమ్మ

ప్రజాశక్తి - ఆదోనిరూరల్


సమావేశంలో మాట్లాడుతున్న రమణమ్మ

భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని కార్మిక శాఖ సహాయ కమిషనర్ రమణమ్మ సూచించారు. గురువారం ఆదోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో 2018-19, 2019-20 సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదికలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గతంలో అర్హులైన కార్మికులు, వారి కుటుంబ సభ్యుల వివాహానికి రూ.10 వేలు, మహిళల ప్రసవాలకు రూ.20 వేలు, మృతి చెందిన వారికి రూ.50 వేలు అందించినట్లు తెలిపారు. అర్హులైన కార్మికులకు లబ్ధి చేకూరిందా లేదా అని విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఎంపిడిఒ వీరశేఖర రావు, ఎస్ఎంటి ఎ.లోకేశ్వర రెడ్డి, ఎస్ఆర్‌పి టి.మల్లికార్జున, డిఆర్‌పిలు డి.సురేంద్ర రెడ్డి, ఎం.నాగరాజు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు జె.వెంకట రాముడు, పి.ప్రతాప్ రెడ్డి, ఎం.సుంద్రేష్ పాల్గొన్నారు.

సిఎం జగన్‌ను కలిసిన బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక గురువారం పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అంతా మంచి జరుగుతుందని పేర్కొన్నారు.

కమనీయం.. స్వామి, అమ్మవార్ల కళ్యాణం

ప్రజాశక్తి - ఆస్పరి


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మండలంలోని తొగలగలు గ్రామంలో వెలిసిన శ్రీచెన్నకేశవ స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల కల్యాణోత్సవం గురువారం కమనీయంగా సాగింది. పూజారి చెన్నకేశవులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు గంగ పూజ, బిల్వార్చన, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామివారి పల్లకి సేవ పురవీధుల గుండా మేళ తాళాలతో ఊరేగించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సర్పంచి అంజినయ్య, గ్రామ పెద్దలు లక్ష్మన్న, ఆచారి, సుదర్శన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గొంతెత్తి నినదిద్దాం

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని

దేశంలో 70 శాతానికి పైగా ఉన్న రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుంతెత్తి నినాదిద్దామని నాయకులు కోరారు. ఢిల్లీలో సంయుక్త కిసాన్ మోర్చా తలపెట్టిన బహిరంగ సభకు మద్దతుగా గురువారం రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలోని మున్సిపల్ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం, పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి పిఎస్.గోపాల్, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి బి.వెంకన్న అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు మల్లికార్జున, రైతుసంఘం మండల అధ్యక్షులు నరసప్ప, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణ సీనియర్ నాయకులు బి.మహానంద రెడ్డి, ఎఐటియుసి జిల్లా సమితి సభ్యులు కల్లుబావి రాజు, ప్రగతి మహిళా సంఘం జిల్లా నాయకులు మణెమ్మ, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2021 డిసెంబర్‌లో రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఢిల్లీకి బయల్దేరిన రైతులను హర్యానా సరిహద్దుల్లో అడ్డగించి డ్రోన్ల ద్వారా విష వాయువును చిమ్మించడంతో చాలామంది కంటి చూపు కోల్పోయారని తెలిపారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో శుభకరణ్ సింగ్ అనే యువరైతు మృతి చెందారని చెప్పారు. మరో ముగ్గురు రైతులు గుండెపోటుతో మరణించారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులపై అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఢిల్లీ నగరం రామ్ లీలా మైదానంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో లక్షలాది మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు బి.తిప్పన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప పాల్గొన్నారు. **దేవనకొండ**లోని అంబేద్కర్ విగ్రహం ముందు రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిరసన ధర్నా చేపట్టారు. వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, ఎఐటియుసి మండల గౌరవాధ్యక్షులు ఎమ్.నరసరావు, రైతుసంఘం, బికెఎంయు, సిఐటియు, ఎఐటియుసి, కౌలు రైతు సంఘం, చేతి వృత్తి, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు బజారి, మహబూబ్ బాషా, యూసుఫ్ బాషా, నాగేష్, భాస్కర్, కోదండ, ఆచారి వీరస్వామి, వీరాంజనేయులు, మహేంద్ర, బండ్లయ్య, రాము, రాముడు పాల్గొన్నారు. **ఆలూరు** అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, సిపిఐ మండల కార్యదర్శి రామాంజినేయులు, సిపిఎం మండల కార్యదర్శి షాకీర్, రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న మాట్లాడారు. రైతు, కార్మిక సంఘాల నాయకులు హోతూరప్ప, రామచంద్ర, వీరేష్, ఈశ్వర్ గౌడ్, విఠల్, కృష్ణ, మైనా, గోవర్ధన్ పాల్గొన్నారు. **ఆస్పరి** బస్టాండ్‌లో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రప్ప, సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, రైతుసంఘం మండల కార్యదర్శి రంగస్వామి, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు ఉరుకుందప్ప, రంగస్వామి, సిపిఐ సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, ఉరుకుందప్ప పాల్గొన్నారు. **హోళగుంద**లో సిపిఎం, సిపిఐ కాంగ్రెస్, రైతుసంఘం, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి, తహశీల్దార్ ఎం.ప్రసాద్ రాజుకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా నాయకులు తిమ్మయ్య, సిపిఐ మండల కార్యదర్శి పెద్దహ్యాట మారెప్ప, సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీరంగ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రంగన్న, కాంగ్రెస్ నాయకులు మంగయ్య, నాయకులు కట్టప్ప, సలాం సాబ్, హినహిత్, రవి, సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు, మల్లయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.


ఆదోనిలో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు



దేవనకొండలో నిరసన తెలుపుతున్న నాయకులు



దేవనకొండలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

'ప్రయివేట్‌కు ధీటుగా విద్యాభోదన'

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన చేపట్టాలని ఎంఇఒలు సువర్ణల సునియం, రామమూర్తి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని కంబదహాళ్ ప్రాథమికోన్నత పాఠశాలను వార్షిక తనిఖీ చేశారు. పాఠశాల సమయపాలన, రికార్డులను పరిశీలించారు. బోధనను పరిశీలించి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఇఒలు

క్రియాశీలక సభ్యత్వంతో కుటుంబానికి రక్ష

- జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వెంకప్ప

ప్రజాశక్తి-ఆలూరు

క్రియాశీలక సభ్యత్వంతో జనసేన పార్టీ రెండు కుటుంబాలను ఆదుకుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆస్పరి మండలం చిరుమాన్ దొడ్డి గ్రామానికి చెందిన బాలమద్ది, హాలహర్వి మండలం కామినహాల్ గ్రామానికి చెందిన విజయ్ కుమార్ ప్రమాదవశాత్తు మృతి చెందారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు బుధవారం మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జనసేన పార్టీ పిఎసి సభ్యులు నాగబాబు చేతులమీదుగా రూ.5 లక్షల చెక్కును అందజేసినట్లు చెప్పారు. రూ.500 కట్టి సభ్యత్వం తీసుకున్నారని, ప్రమాదవశాత్తు మరణించగా బాధిత కుటుంబసభ్యులు బీమా రూ.5 లక్షలు పొందారని తెలిపారు. మరోసారి అవకాశం వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ రూ.500 కట్టి జనసేన సభ్యత్వం తీసుకుంటే కుటుంబానికి అండగా ఉంటుందని చెప్పారు. బాధిత కుంటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు, జనసేన పార్టీ ఆస్పరి మండల అధ్యక్షులు అరవింద్ కుమార్, హాలహర్వి మండల అధ్యక్షులు చంద్ర, జనసేన నాయకులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న నాగబాబు

రాఘవేంద్రా రెడ్డికి మంత్రాలయం టిడిపి టికెట్

ప్రజాశక్తి - మంత్రాలయం



మంత్రాలయం టిడిపి నియోజకవర్గ టికెట్‌ను మాధవరం రాఘవేంద్రా రెడ్డికి కేటాయించారు. గురువారం టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు టిడిపి అభ్యర్థిగా నల్గొగోని మాధవరం రాఘవేంద్రా రెడ్డిని ప్రకటించారు. టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి, కెడిసిసి మాజీ ఛైర్మన్ నల్గొగోని మాధవరం రామిరెడ్డి కుమారుడు ఎన్.రాఘవేంద్రా రెడ్డి బీసీ సామాజిక వర్గంలోని వాల్మీకి నాయకుల్లో బలమైన నాయకులుగా గుర్తించిన అధిష్టానం టికెట్‌ను కేటాయించింది. రాఘవేంద్రా రెడ్డి గ్రూపులో సంబరాలు అంబరాన్నంటాయి. టిడిపి సీనియర్ నాయకులు గోతులదొడ్డి ఉలిగయ్య, కోసిగి ముత్తు రెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి గ్రూపుతో సన్నిహితంగా ఉంటూ 'మేమంతా ఒక్కటే' అనే నమ్మకాన్ని అధిష్టానానికి కలిగించినట్లు తెలిసిం ది. రాఘవేంద్రా రెడ్డిని టికెట్ వరించడంతో మాధవరం గ్రామంలోని ఆయన ఇంటికి చేరుకున్న టిడిపి నాయకులు, వాల్మీకి నాయకులు ఆయనకు, ఆయన సోదరులు రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డికి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద తాలూకా సిఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ వాహనాల పత్రాలు దగ్గర ఉంచుకోవాలని ద్విచక్ర వాహనదారులకు సూచించారు. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో పకడ్బందీగా వాహనాన్ని తనిఖీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదకరమని తెలిపారు.

టికెట్ కేటాయింపుపై

భగ్గుమన్న తెలుగు తమ్ముళ్లు

- మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధం - తిక్కారెడ్డి గ్రూపు నాయకులు - ఆందోళనలతో రోడ్లపై నిరసన

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి టికెట్ కేటాయింపుపై తెలుగు తమ్ముళ్లు భగ్గుమన్నారు. గురువారం టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు రెండో జాబితాను ప్రకటించారు. మంత్రాలయం నుంచి టిడిపి టికెట్‌ను ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డికి కాకుండా బీసీ సామాజిక వర్గంలోని వాల్మీకి నాయకులు, కెడిసిసి మాజీ ఛైర్మన్ నల్గొగోని మాధవరం రామిరెడ్డి కుమారులు ఎన్.రాఘవేంద్రా రెడ్డికి కేటాయించారు. తిక్కారెడ్డి గ్రూపు నాయకులు ఆందోళనలతో నిరసన వ్యక్తం చేపట్టారు. మూకుమ్మడిగా రాజీనామాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. రాఘవేంద్రారెడ్డి ఎన్నికల బరిలో ఉంటే ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి నాలుగోసారి ప్రచారం చేయకున్నా గెలుస్తారని, బాలనాగిరెడ్డిని గెలిపించేందుకే చంద్రబాబు రాఘవేంద్రా రెడ్డికి టికెట్ ఇచ్చినట్లు ఉందని తెలిపారు. కోసిగి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జీ జ్ఞానేష్ ఆధ్వర్యంలో టైర్లకు నిప్పంటించి ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గురువారం మంత్రాలయంలోని రాఘవేంద్ర సర్కిల్‌లో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేశప్ప స్వామి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి, నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉన్న తిక్కారెడ్డికి కాకుండా రాఘవేంద్రా రెడ్డికి టికెట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. రెండు నెలల క్రితం వైసిపికి రాజీనామా చేసి టిడిపిలోకి వచ్చిన ఎన్.రాఘవేంద్ర రెడ్డికి టికెట్ కేటాయించడంతో రాజీనామాలు చేస్తున్నామని తెలిపారు. అధిష్టానం ఆలోచించి తిక్కారెడ్డికి టికెట్ ఇవ్వాలని, లేకపోతే మూకుమ్మడి రాజీనామాలను ఆమోదించాలని కోరారు. టిడిపి నాయకులు మల్లికార్జున రెడ్డి, ఎల్లారెడ్డి, చావిడి వెంకటేష్, అమర్‌నాథ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, అశోక్ రెడ్డి, పవన్ కుమార్, చిలుకలడోన హనుమంతు, వట్టెప్ప గారి నరసింహులు పాల్గొన్నారు.


నిరసన చేపడుతున్న నాయకులు

ఉద్యోగాలను అమ్మకానికి పెట్టిన జగన్ రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం

సంతలో పశువులకు బేరం పెట్టినట్లు ఉద్యోగాలను అమ్మకానికి పెట్టిన జగన్ రెడ్డి ఎపిపిఎస్‌సిని అమ్మకానికి పెట్టారని మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి విమర్శించారు. గురువారం నందవరం బస్టాండ్‌లో ఎపిపిఎస్‌సిలో జరిగిన అక్రమాలను నిరసిస్తూ ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రూపు-1 మెయిన్స్‌లో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అక్రమాలపై హైకోర్టు బహిర్గతం చేసిందని, ఎపిపిఎస్‌సిలో సుమారు రూ.150 కోట్ల అవినీతి బట్టబయలు అయిందని తెలిపారు. ఒక్కో డిప్యూటీ కలెక్టర్ పోస్టు రూ.2.50 కోట్లకు, ఒక్కో డీఎస్పీ పోస్టు రూ.1.50 కోట్లకు బేరం పెట్టి 30 డిప్యూటీ కలెక్టర్లు, 25 డీఎస్పీ పోస్టులను అమ్ముకొని నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. గ్రూపు-1 మెయిన్స్‌లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని, ఆ నోటిఫికేషన్ ద్వారా నియామకమైన ప్రస్తుతం వివిధ హోదాల్లో ఉన్న 162 మంది నియామకాలు చెల్లవని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. టిడిపి హయాంలో 2018 డిసెంబర్ 31న 162 గ్రూపు-1 ఉద్యోగాలకు నోటిఫికేషన్ (27/2018) జారీ చేసిందని, తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ప్రిలిమ్స్ ఎగ్జామ్ మే 27, 2019న, మెయిన్స్ ఎగ్జామ్ 14 డిసెంబర్ 2022న నిర్వహించి అక్రమాలకు పాల్పడిందని చెప్పారు. మాన్యువల్ మూల్యాంకనం కాకుండా తమ వారికి ఉద్యోగాలు కట్టబెట్టేందుకు ప్లాన్ చేసి మరి డిజిటల్ వ్యాల్యుయేషన్ చేశారన్నారు. వైసిపి ప్రభుత్వ అక్రమాలపై అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో మాన్యువల్ విధానంలో మూల్యాంకనం చేయాలని అక్టోబర్ 1, 2021న హైకోర్టు తీర్పునిస్తూ మూడు నెలల్లోపు ఫలితాలను ప్రకటించాలని ఆదేశించిందని చెప్పారు. దీని ప్రకారం నవంబర్ 5, 2021 నుంచి ఫిబ్రవరి 25 వరకు మంగళగిరిలో హాయ్ ల్యాండ్‌లో మాన్యువల్ వాల్యుయేషన్ జరిగిందని తెలిపారు. ఆ ఫలితాలు ఫిబ్రవరి 26, 2022న ప్రకటించాలని చెప్పారు. నిర్ణీత సమయంలో ఫలితాలు ప్రకటించకుండా రెండోసారి మార్చి 25, 2022న మాన్యువల్ పద్ధతిలో మూల్యాంకనం మొదలు పెడుతున్నట్లు ఎపిపిఎస్‌సిలో కోర్టు అఫిడవిట్‌లో దాఖలు చేసిందన్నారు. ఎపిపిఎస్‌సిలో రూల్ నెంబర్ 3(9) ఎట్టి పరిస్థితుల్లో రెండోసారి వాల్యుయేషన్ చేయకూడదని తెలిపారు. ఎపిపిఎస్‌సిలో మోసాలపై ఎపిపిఎస్‌సిలో కార్యదర్శి పిఎస్ఆర్.ఆంజనేయులు, ఛైర్మన్ గౌతమ్ సవాంగ్‌పై చర్యలు తీసుకొని, జగన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సిఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

బలమైన అభ్యర్థినే బరిలో దింపండి

- జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో వైసిపిని ఎదుర్కొనే వారినే బరిలో దింపాలని జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప కోరారు. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యకర్తలతో కలిసి జనసేన జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనసేన పార్టీలో చేరినప్పటి నుంచి పవన్ కల్యాణ్ స్ఫూర్తితో, ఆలోచనలు, ఆశయాలతో ప్రశ్నించే గొంతుకగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాడుతూ ఎన్నో విమర్శలకు లోనయ్యామని తెలిపారు. ఆస్తులు మొత్తం పోగొట్టుకున్నామని, అప్పులను మాత్రమే దక్కించుకున్నామని చెప్పారు. అధికార పార్టీ జనసైనికులపై దాడులు చేసినా, దౌర్జన్యం చేసినా, బెదిరించినా అన్నింటికీ తట్టుకొని నిలబడ్డామని, కలబడ్డామని తెలిపారు. ఎన్నో ఆశలు పెట్టుకున్నామని, ఆదోనిలో అధికార పార్టీకి ధీటైన సమర్థులు ఎవరంటే అది కేవలం జనసేన పార్టీనే అనే విధంగా ఆదోని ప్రజలకు ఆలోచింపచేశామని చెప్పారు. నేడు పవన్ కల్యాణ్ రాష్ట్ర భవిష్యత్తుపై ఆలోచించి, సైకో పాలనను తరిమేయాలని, అటు కేంద్రంలోని బిజెపితో, ఇటు రాష్ట్రంలోని టిడిపితో పొత్తులు పెట్టుకోవడం వల్ల ఆదోని జనసేన సీటుపై ఒకింత సందిగ్ధత మొదలైందని తెలిపారు. పవన్ కల్యాణ్ ఏ నిర్ణయం తీసుకున్నా అంతిమంగా కట్టుబడి ఉంటామన్నారు. పొత్తుల్లో భాగంగా బరిలో దించే వ్యక్తి మాత్రం బలమైన అభ్యర్థిని నిలబెట్టాలని కోరారు. ఆదోని ఫైనల్ లిస్ట్ వచ్చే వరకు ఆదోని అభ్యర్థిగా జనసేన పార్టీకి టికెట్ వస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న మల్లప్ప

కర్ణాటక మద్యం స్వాధీనం

- 2,880 టెట్రా ప్యాకెట్లు పట్టివేత
- రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా చిప్పగిరి ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. 2,880 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని, నలుగురు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చిప్పగిరి మండలానికి దగ్గరలో ఉండడంతో మోటార్ సైకిల్‌పై నలుగురు వ్యక్తులు కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. చిప్పగిరి మండలం కుందనగుర్తి గ్రామానికి చెందిన కొండ ధనుంజయ, పూల సతీష్, మాదిగ రవి, నాగప్ప గారి పవన్ కల్యాణ్‌గా గుర్తించామన్నారు. పోలీసులు యశ్వంత్, రామోజీ, భాస్కర్, షబీర్ రహ్మద్, శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీగంగాభవాని రథోత్సవం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని బాపురం గ్రామంలో వెలసిన శ్రీగంగాభవాని రథోత్సవం వైభవంగా సాగింది. గురువారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పూర్ణకుంభం గంగాభవాని మఠం నుంచి పీఠాధిపతి బసిలింగమ్మవ్వ ఆధ్వర్యంలో రథం వరకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అమ్మవారి ప్రతిమను ఉంచి అశేష జనవాహిని మధ్య రథం లాగారు. ఎంపిపి శ్రీవిద్య, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, నాయకులు హనుమంత రెడ్డి, సర్పంచి మాల బసమ్మ, ఎంపిటిసి ముత్తమ్మ, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి, నాయకులు వీరేష్ గౌడ్, శివకుమార్, మల్లికార్జున, నరసింహులు, వైసిపి నాయకులు వీరేష్, బ్రహ్మయ్య, వ్యకాస నాయకులు తిక్కన్న, హనుమంతు పాల్గొన్నారు.

కనుల పండువగా జోడు రథోత్సవాలు

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని గూళ్యం గ్రామంలో వెలసిన శ్రీశరణ గాది లింగేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం గూళ్యంలో సిద్ధేశ్వర, గాదిలింగేశ్వర జోడు రథోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. రథోత్సవానికి ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. ఉత్సవంలో గొరవయ్యల నృత్యాలు అలరించాయి. ముందుగా ఆలయ అధికారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకి కొలువుంచారు. ఊరేగింపుగా తీసుకెళ్లి రథాలపై అధిష్టింపజేశారు. అనంతరం భక్తుల జయజయ ధ్వనుల మధ్య రథాలు ముందుకు కదిలాయి. గాదిలింగేశ్వరస్వామి ఆలయానికి ఎదురు బసవన్న దేవాలయం వరకు జోడు రథాలు సాగాయి. అక్కడ బసవన్నకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రథాలను యథాస్థానానికి చేర్చారు. ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సర్పంచి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నరేంద్ర బందోబస్తు నిర్వహించారు.

'రైతు సమస్యలు పరిష్కరించాలి'

ప్రజాశక్తి - హాలహర్వి

రైతు సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు కృష్ణ కోరారు. గురువారం తహశీల్దార్ బ్యూలాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు రుణమాఫీ, వేదవతి, నగరడోనా ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరారు. మండలంలోని పప్పు శనగ రైతులకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా సమగ్ర పంటల బీమా పథకం పెట్టాలని కోరారు. హుసేన్, కిషోర్, రైతులు పాల్గొన్నారు.

'విట్టా రమేష్‌కే సీట్ కేటాయించాలి'


మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

వ్యాపారవేత్త, నియోజకవర్గ ప్రజలకు సుపరిచితులైన విట్టా రమేష్‌కే ఆదోని ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాల బద్రీనాథ్, ఆదోని అధ్యక్షులు విటి.ప్రకాష్ డిమాండ్ చేశారు. గురువారం భీమాస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదోనిలో పరిశ్రమలు నెలకొల్పి ఎంతోమందికి విట్టా ఫ్యామిలీ ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. ఆ కుటుంబానికి చెందిన విట్టా క్రిష్టప్ప పలుమార్లు మున్సిపల్ ఛైర్మన్‌గా సేవలందించి ఆదోని పట్టణాభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. వివాదాలకు దూరంగా ఉంటూ కులమతాలకు అతీతంగా అందరినీ కలుపుకుపోవడం విట్టా రమేష్ నైజమని కొనియాడారు. ఆదోనిలో పలు సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజాసేవకు అంకితమయ్యారని పేర్కొన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా విట్టా రమేష్‌ను బరిలో నిలిపితే గెలిపించుకుంటామని తెలిపారు. నాయకులు మనోహరయ్య, ఈరన్న, నారాయణ, శ్రీధర్, వినోద్ కుమార్, వినీత, పరిమళ, రంగనాయకులు ఉన్నారు.

హోళగుందలో అన్నదానం

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుందలో గురువారం శ్రీవరబసవేశ్వర స్వామి దేవస్థానం వద్ద గూళ్యం శ్రీశివ శరణ గాదిలింగప్ప తాత రథోత్సవానికి వెళ్లే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతేడాదిలాగే ఈఏడాది కూడా శ్రీశివ శరణ గాదిలింగప్ప తాత రథోత్సవానికి వెళ్లే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు





నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు, రైతులు, కార్మికులు

వైసిపి అభ్యర్థిగా కాటసాని రామిరెడ్డి

- రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటన
- వంద పడకల ప్రభుత్వ వైద్యశాల ప్రారంభం
- 'ఇబిసి నేస్తం' మూడో విడత నిధులు విడుదల



ఈబిసి నేస్తం మెగా చెక్కును అందజేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె నియోజకవర్గం వైసిపి అభ్యర్థిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. గురువారం బనగానపల్లె పట్టణంలో రూ. 22 కోట్లతో నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా వైద్యశాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్ఆర్ ఇబిసి నేస్తం పథకాన్ని మూడో విడత బటన్ నొక్కి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ బనగానపల్లె ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డిని గత ఎన్నిక కంటే ఈసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కాటసాని రామిరెడ్డి ఇక్కడ ఎమ్మెల్యే అయితేనే తాను ముఖ్యమంత్రిగా అవుతానని, ప్రజలకు సంక్షేమ పథకాలు కులమతాలకు, పార్టీల కతీతంగా అందాలంటే మరోసారి వైసిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇక్కడ టిడిపి అభ్యర్థి బిసి జనార్ధన్ రెడ్డి ధనవంతుడని, ఓటుకు రెండు, మూడు వేలు ఇస్తారని తెలిపారు. టిడిపి అభ్యర్థి వద్ద డబ్బులు తీసుకొని వైసిపి అభ్యర్థి కాటసాని రామిరెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కాటసాని రామిరెడ్డి గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధి అవుతుందని, రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే లబ్ధిదారులకు బటన్ నొక్కి నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని, అవినీతి, లంచాలు, వివక్ష వస్తుందని తెలిపారు. పేదల భవిష్యత్తు కోసం వైసిపిని గెలిపించాలని కోరారు. బనగానపల్లె పట్టణంలో 3200 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తుంటే టిడిపి అభ్యర్థి బిసి జనార్ధన్ రెడ్డి కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని, వైసిపికి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని పట్టాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఇంటి పట్టాలివ్వాలన్నా, ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు పనులు చేయాలన్నా, ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టాలన్నా, పేద పిల్లలకు గొప్ప చదువులు చదివించాలన్న టిడిపి రాక్షసులతో యుద్ధం చేయాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, పాణ్యం, ఆత్మకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి.నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎం ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తున్నారు : ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకారంతో రూ.22 కోట్లతో 100 పడకల ప్రభుత్వ ఏరియా వైద్యశాలను నిర్మించామన్నారు. డిఎంఎఫ్ నిధులతో బనగానపల్లె, కోవెలకుంట్ల, కొలిమిగుండ్లలో ఫోర్‌లైన్ రోడ్డును వేసి సెంటర్ షైట్లను, డివైడర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాలలో నియోజకవర్గంలో ఎంతో అభివద్ధి పనులు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గోరుకల్లో రిజర్వాయర్ నుండి ఎస్ఆర్బిసి కాల్వకు నీటిని వదిలి ఆదుకున్నట్లు చెప్పారు. పట్టణంలో పేదలకు పట్టాలిస్తుంటే మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని విమర్శించారు. బనగానపల్లి మండలంలోని పడమటి పల్లెల్లో వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించి అవుకు రిజర్వాయర్ నుండి 100 కోట్ల రూపాయలతో సిడబ్ల్యు స్కీమ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాయల్టీలతో నాపరాతి గని యజమానులు ఇబ్బందులు పడుతున్నారని, రాయల్టీని తగ్గించాలని కోరారు. ప్రభుత్వ వైద్యశాలను 200 పడకల వైద్యశాలగా అప్డేట్ చేసి ఎమ్మారై, సిటీ స్కాన్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి కోసం అడిగిన పనుల్లో సిఎం జగన్మోహన్ రెడ్డి స్పందించి అవుకు రిజర్వాయర్ నుండి 100 కోట్ల రూపాయలతో సి డబ్ల్యు స్కీమ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యువ నాయకుడు కాటసాని ఓబుల్ రెడ్డి, ఎంపిపి మానసవీణ, జడ్పిటిసి లక్ష్మీ సుబ్బమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుండం నాగేశ్వర రెడ్డి, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, బనగానపల్లె మండల కన్వీనర్ సన్నాల జనార్దన్ రెడ్డి, నాయకులు జిల్లెల్ల శంకర్ రెడ్డి, బండి బ్రహ్మానంద రెడ్డి, పాతపాడు వెంకటేశ్వర రెడ్డి, అంబటి రవికుమార్ రెడ్డి, మీరాపురం మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, గంగుల బ్రిజేంద్రారెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి, కలెక్టర్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా

మోడీ ప్రభుత్వ పతనం ఖాయం

- రైతు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి
- ప్రజా సంఘాల నేతల డిమాండ్
- నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరులో నిరసన

ప్రజాశక్తి - నంద్యాల

దేశవ్యాప్తంగా రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పతనం కావడం తథ్యమని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు తమ కోర్కెలపై గళం విప్పి వినిపించాలని ఢిల్లీలో భారీ బహిరంగ సభకు సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ల సమన్వయ కమిటీలు పిలుపునిచ్చాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, వ్యవసాయ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని పద్మావతి నగర్ సెంటర్లో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.మార్కు మాట్లాడారు. రైతు, కార్మికుల డిమాండ్లను నెరవేర్చకపోతే రాబోయే ఎన్నికల్లో కార్మికులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులంతా ఐక్యమై బిజెపి ప్రభుత్వాన్ని కూకటి వేళ్ళతో పెకిలించివేస్తారని హెచ్చరించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు సి2 ప్లస్ 50 ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలన్నారు. రైతుల రుణాలు మాఫీ చేయాలని, కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించి, 200 రోజులకు పని దినాలు పెంచాలని, వేతనం రూ.600 పెంచాలని, 2 పూటలు పని, ఆన్లైన్ మస్టర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠ పరచాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, కడప ఉక్కును ప్రభుత్వ రంగంలోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించు కోవాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని కోరారు. భూ హక్కుల చట్టం **మిగతా 6వ పేజీలో...**

టిడిపి రెండో జాబితాలో ముగ్గురు

- ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందికొట్కూరు అభ్యర్థుల ఖరారు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఇప్పటికే తమ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేసిన టిడిపి తాజాగా రెండో జాబితాను విడుదల చేసింది. గురువారం ఆ పార్టీ కార్యాలయం నుండి రెండో జాబితాను విడుదల చేశారు. ఆ జాబితాలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి ముగ్గురు అభ్యర్థులను ఖరారు చేశారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందికొట్కూరు అభ్యర్థులను ప్రకటించారు. ఎమ్మిగనూరు అభ్యర్థిగా బివి.జయనాగేశ్వర రెడ్డి, మంత్రాలయం అభ్యర్థిగా నల్లగౌని రాఘవేంద్ర రెడ్డి, నందికొట్కూరు అభ్యర్థిగా గిత్తా జయసూర్య పేర్లను ప్రకటించారు. ఎమ్మిగనూరు, నందికొట్కూరులో ముందు నుండి అనుకున్న వారికే టిక్కెట్లు కేటాయించారు. మంత్రాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్యాలకుర్తి తిక్కారెడ్డి పేరును ఖరారు చేస్తారని అనుకున్నా అనూహ్యంగా రాఘవేంద్ర రెడ్డి పేరును ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. తిక్కారెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని ఆయన అనుచరులు ఎదురు చూస్తున్నారు.



నందికొట్కూరు అభ్యర్థి గిత్తా జయసూర్య

ఎమ్మిగనూరు అభ్యర్థి బివి జయనాగేశ్వరె రెడ్డి

మంత్రాయలం అభ్యర్థి నల్లగౌని రాఘువేంద్ర రెడ్డి

ఆ స్థానాలపై ఉత్కంఠ

టిడిపి తొలి జాబితాలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి తొమ్మిది అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆళ్లగడ్డ, బనగానపల్లె, కర్నూలు, కోడుమూరు, పాణ్యం, నంద్యాల, శ్రీశైలం, డోన్, పత్తికొండ అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను తొలి జాబితాలోనే ఖరారు చేశారు. రెండో జాబితాలో ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందికొట్కూరు అభ్యర్థులను ప్రకటించారు. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా ఇప్పటి వరకు 12 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆదోని, ఆలూరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. దీంతో ఆ రెండు స్థానాలపై ఉత్కంఠ నెలకొంది. ఆలూరు టిడిపి ఇంచార్జిగా కోట్ల సుజాతమ్మ ఉండగా ఇప్పటికే డోన్ టిడిపి అభ్యర్థిగా కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పేరును ఖరారు చేశారు. కుటుంబానికి ఒకే టికెట్ కేటాయిస్తామని ఆ పార్టీ అధినేత చెప్పడంతో ఆలూరు టికెట్ ఎవరికి దక్కుతుందోనని అందరూ ఎదురుచూస్తున్నారు. టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా ఆదోని స్థానాన్ని బిజెపికి కేటాయించనున్నట్లు ప్రచారం సాగుతోంది.

18 నుండి ఒంటిపూట బడులు : డిఇఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 18 నుంచి ఒంటిపూట బడుల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని జిల్లా విద్యాశాఖాధికారి కే సుధాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని సూచించారు. ఏప్రిల్లో నెలలో రెండో శనివారం పాఠశాలలు పని చేయాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఆరుబయట, చెట్ల కింద తరగతులు నిర్వహించొద్దని హెచ్ఎంలను ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు జరుగు కేంద్రాల హెచ్ఎంలు ఆయా రోజులలో ఎలాంటి క్లాసులు జరుపరాదని, ఈ ఏడు రోజులకు బదులుగా మార్చి 24, 31, ఏప్రిల్ 7, 13, 14, 21 తేదీల్లో తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.



అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల పట్టణంలోని ఎన్జీఓ కాలనీ, ఎస్బీఐ కాలనీ, వైఎస్ఆర్ నగర్ కాలనీలలో రూ. 1 కోటి 10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లను నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా గురువారం ప్రారంభించారు. మరో 38 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల ప్రజలు రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో పట్టణ, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిని గమనించాలని, మంచి చేసిన వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, వార్డు కౌన్సిలర్లు దేశం సులోచన, వాసగిరి విజయభాస్కర్, తూర్పునాటి సావిత్రమ్మ, వార్డు ఇన్‌చార్జులు దేశం సుధాకర్రెడ్డి, టివి రమణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా బరగొడ్ల హుస్సేన్ బాషా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులుగా ఆళ్లగడ్డకు చెందిన బరగొడ్ల హుస్సేన్ బాషాను నియమించారు. గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా కార్యవర్గ సమావేశంలో బరగొడ్ల హుస్సేన్ బాషాను జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను వైస్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు డిసిసి అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్‌కి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలమ్మకు, వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలికి, తులసి రెడ్డికి, ఎఐసిసి మల్లికార్జునకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం మల్లేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వై.సంజీవ కుమార్, జిల్లా నాయకులు నజీర్ బాష, మహబూబ్ బాష, పాశం వెంకట నరసింహుడు, పసుపులేటి లక్ష్మి నరసింహుడు, చాకలి నాగయ్య, శ్రీనివాసులు, పాపాజి, దస్తగిరి తదితర నాయకులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న హుస్సేన్ బాషా

బస్టాండే లేదు.. హెలిప్యాడ్ నిర్మాణమంటా..!

- మహానంది క్షేత్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి హవా
- సొంత భూమి విలువ పెంచుకునేందుకు రాజకీయ పలుకుబడితో హెలిప్యాడ్ నిర్మాణానికి యత్నాలు
- వ్యతిరేకిస్తున్న దేవస్థానం ఉద్యోగ సంఘాలు, మాజీ పాలకమండలి అధ్యక్షులు, స్థానికులు

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్రంలో భక్తులకు కావాల్సిన కనీస సౌకర్యం బస్టాండ్ లేదు.. కనీసం బస్ షెల్టర్ కూడా లేదు. కానీ క్షేత్రంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి, బడాబాబు తన రాజకీయ పలుబడితో హెలిప్యాడ్ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇది కేవలం తన సొంత ప్రయోజనాల కోసమే చేపడుతున్నారు. మహానంది క్షేత్రంలోని పెద్దనంది సమీపంలో హెలిప్యాడ్ నిర్మిస్తే ఆలయ భూమికి నష్టం వాటిల్లుతుంది. అలాగే మహాశివరాత్రి, ఉగాది, కార్తీక మాసం తదితర పర్వదిన సందర్భాలలో సాధారణ భక్తులకు సంబంధించిన వాహనాల పార్కింగ్, ఇతర సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.



మహానంది క్షేత్రంలో భక్తులకు కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. కనీసం బస్ షెల్టర్, బస్టాండ్ సౌకర్యం కూడా లేదు. అయితే ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తనకున్న రాజకీయ పలుకుబడితో హెలిప్యాడ్ నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. వివిఐపిల కోసం, భక్తుల సౌకర్యం కోసం మాత్రమే హెలిపాడ్ నిర్మాణానికి ప్రయత్నాలు జరగడం లేదు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారి భూమి విలువ పెంచుకోవడం కోసమే.. మహానంది క్షేత్రంలోని పెద్దనంది సమీపంలో ప్రస్తుతం వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్న స్థలాన్ని అనుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారి భూమి ఉంది. ప్రస్తుతం ఆ స్థలానికి ఎటు కూడా దారి లేదు. కేవలం ప్రస్తుతం పార్కింగ్ కోసం వినియోగిస్తున్న ఆలయ భూమి నుండి మాత్రమే రాకపోకలు జరపాల్సి ఉంటుంది. ఆలయ భూమిలో హెలిప్యాడ్ నిర్మిస్తే తమ స్థలాలతోపాటు ఇతర భూములకు కూడా విలువ వస్తుందని భావిస్తూ బడాబాబు తెరలేపినట్లు తెలుస్తుంది. హెలిప్యాడ్ నిర్మాణం వల్ల భక్తులకు ఉపయోగం లేదు. ఆగమ శాస్త్రానికి, ఆలయ సాంప్రదాయాలకు విరుద్ధంగా ఆలయ ప్రధాన రాజగోపురం కంటే ఎత్తు భాగంలో ఎలాంటి లోహ విహంగాలు తిరగడానికి వీలులేదు. గతంలో కూడా పెద్దనంది ముందు భాగంలో ఉన్న ఆలయానికి చెందిన భూమిలో ఒకసారి ఒక సామాజిక వర్గానికి చెందిన సత్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించారు. రెండవ సారి యూనిసెఫ్ పేరుతో అక్కడ నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నించారు. ప్రస్తుతం మూడవ సారి ఏషియన్ పసిఫిక్ రీజియన్ పేరుతో హెలిప్యాడ్ నిర్మాణానికి ఒత్తిడి తీసుకొస్తున్నారు. దాదాపు 15 సంవత్సరాలు నుంచి వివిధ రకాల నిర్మాణాల పేరుతో ఆలయ భూమిలో చేపట్టడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే మహానంది దేవస్థానం ఉద్యోగ సంఘాలు, దేవస్థానం మాజీ పాలకమండలి అధ్యక్షులు, మహానంది గ్రామస్థుల ఆధ్వర్యంలో దీనిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. హెలిప్యాడ్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి గురువారంవినతి పత్రాన్ని అందజేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీ, దేవదాయ కమిషనర్ దృష్టికి ఎమ్మెల్యే విషయం తీసుకుపోయినట్లు సమాచారం.

టిడిపి పథకాలను ప్రజలకు వివరించాలి : ఎన్ఎండి ఫరూక్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు వివరించాలని నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ నాయకులకు సూచించారు. గురువారం నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన శంఖారావం కిట్ల పంపిణీ ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. టిడిపి గెలుపునకు పాండురంగాపురం గ్రామనాయకులు, ప్రజలు గ్రామంలో మెజారిటీ తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాండురంగాపురం గ్రామ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్ఎండి ఫరూక్

వైఎస్ఆర్, నవాబ్‌ల విగ్రహాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని పెట్రోల్ బంకు కూడలిలో వైఎస్ఆర్, బనగానపల్లె నవాబు బహదూర్ మీర్ ఫజల్ అలీ ఖాన్ విగ్రహాలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నవాబు వంశీయులు మీర్ ఫజల్ అలీ ఖాన్, వైసీపీ నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డిలు గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, జడ్పిటిసి సుబ్బ లక్ష్మమ్మ, ఎంపీపీ మానసవీణ, సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, ఉమ్మడి జిల్లాల ఎంపిటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, పెద్దన్న, సజ్జాత్ హుస్సేన్, సంఘం హొటల్ హైదర్, గౌండ కంబగిరి, కలాం, మొక్త్యార్, వార్డ్ మెంబర్ కుమ్మరి సురేష్, ఆటో నగర్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



వైయస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



విద్యార్థిని వై.అభిలాషితను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్

సైనిక్ స్కూల్‌కు 'విజయానికేతన్' విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - పాణ్యం

జనవరి నెలలో జరిగిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలలో పాణ్యంలోని విజయానికేతన్ పాఠశాల విద్యార్థిని వై.అభిలాషిత ప్రతిభ చాటి ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు వై.అభిలాషిత, విక్రమ్ రాజు, గౌతమ్ తేజ్, అర్జున్ గౌడ్‌లు ప్రతిభ కనబరిచి ఉత్తమ ర్యాంకులు సాధించారని చెప్పారు. విద్యార్థిని అభిలాషిత 5361 ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. లక్ష మందికి పైగా దేశ వ్యాప్తంగా రాసిన ఈ ప్రవేశ పరీక్షలో తమ విద్యార్థిని ఉత్తమ ర్యాంక్ సాధించడం విజయనికేతన్ పాఠశాల కృషి కారణమన్నారు. పట్టణాలకే పరిమితమైన సైనిక్, నవోదయ, రాష్ట్రీయ మిలటరీ శిక్షణ తదితర ప్రవేశ పరీక్షలకు నిష్ణాతులైన వారిచే శిక్షణ ఇప్పించి ర్యాంకుల సాధనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఫలితాలకు కారణమైన ఉపాధ్యాయులను అకాడమిక్ ఇన్‌ఛార్జి మురారి వేణుగోపాల్ అభినందించి రాబోయే రోజుల్లో ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. మంచి మెటీరియల్ సేకరించి విద్యార్థులకు తర్ఫీదు నిచ్చిన రాజును పాఠశాల సిబ్బంది అభినందించారు.

సిఎం సభకు జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి గైర్హాజరు

ప్రజాశక్తి - అవుకు

దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి సతీమణి, అవుకు జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి గురువారం బనగానపల్లెలో జరిగిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సభకు గైర్హాజరు కావడం మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చల్లా కుటుంబంకి రెండు సార్లు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకానికి హాజరవుతున్న జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి ఎన్నికల ముందు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సిఎం సభకు హాజరు కాకపోవడం పట్ల వైసిపి శ్రేణుల్లో తీవ్ర చర్చగా మారింది. ఏదేమైనా వైసిపికి నుండి మంచి బలమైన నాయకురాలు సభకు హాజరు కాకపోవడంతో పార్టీలో ఉంటారా లేక వేరే పార్టీ మారే అవకాశం ఉందా అన్న సందేహం వ్యక్తమవుతుందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న చైర్మన్ చలం రెడ్డి, ఎంపిపి

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - డోన్

బేతంచర్ల పట్టణంలోని గంధం వీటి తిరుమలమ్మకు రూ.2.50 లక్షల చెక్కు మంజూరు కావడంతో మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి బాధితుల కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం అందజేశారు. గంధం వీటి తిరుమలమ్మ అనారోగ్యంతో కొంతకాలంగా ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న నయం కానందున తన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వై సురేంద్ర నాథ్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, ఎద్దులన్న, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ రషీద్



రోడ్ల పనులను ప్రారంభించిన ఎం.ఏ రషీద్, కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఆత్మకూరు

పట్టణ ప్రజలకు అన్ని విధాలుగా అభివద్ధి పనులు చేపట్టి వార్డు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే వైసిపి లక్ష్యమని ఆత్మకూరు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్, 16వ వార్డు కౌన్సిలర్ కురుపాటి విజయ్ చౌదరిలు అన్నారు. గురువారం పట్టణంలోని 6వ వార్డు పరిధిలో ఇస్లాం పేటలో 15వ ఆర్థిక సంఘం నిధులతో 165 మీటర్ల సీసీ రోడ్డు పనులను భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా సహకారంతో పట్టణ ప్రజలకు వర్షాకాలంలో వార్డు ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా సిసి రోడ్డు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. డ్రైనేజీ కాలువలు విద్యుత్ కాంతులు స్తంభాలు మరియు పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు చొరవ తీసుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు ఇంచార్జ్ అహ్మద్, రసూల్, వైసిపి సీనియర్ నాయకులు రఫిక్ కుదుస్, తిమోతి, షఫీ ఉల్లా, షాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

100 శాతం జిఇఆర్ : ఎంఇఒ

ప్రజాశక్తి - పగిడ్యాల



మండల పరిధిలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమంలో 100 శాతం జిఈఆర్ సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి సుభాన్ గురువారం తెలిపారు. ఈ సంద ర్భంగా సుభాన్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలనే కార్యక్రమంలో పూర్తిగా చేపట్టి పిల్లల సమీపాన ఉన్న బడిలో చేర్పించడం జరిగిం దన్నారు. నంద్యాల జిల్లా మొత్తం జిఈఆర్ 100 శాతం కావడం ఎంతో అభినందనీయ మన్నారు. సిబ్బందితో ఇంటింటా తిరిగి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యా ర్థులకు ప్రభుత్వం ఇచ్చే పథకాల గురించి వివరించి పిల్లలను బడిలో చేర్పించడం జరిగిం దన్నారు. గ్రామాలలో తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద, బస్టాండ్‌లో గోడపత్రికలు అంటించి ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించడం జరిగిం దన్నారు. ఇందుకు సహకరించిన ఎంపీడీవో, మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, మండలంలోని ఆయా సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు సహకరించడం వల్లనే జిఈఆర్‌ను 100 శాతం పూర్తి చేయగలడం జరిగిందన్నారు.

పని కోరిన ప్రతి ఒక్కరికీ ఉపాధి

- ఎంపిడిఒ సరస్వతి



ఉపాధి కూలీల మాస్టర్లు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సరస్వతి

ప్రజాశక్తి - పాములపాడు

ఉపాధి పని కోరిన ప్రతి ఒక్కరికీ పని చూపిస్తామని పాములపాడు ఎంపీడీవో సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని లింగాల గ్రామంలో జరుగుతున్న ఎన్ఆర్ఈ జీఎస్ పనులను ఆమె పరిశీలించారు. ఉపాధి కూలీల హాజరును తనిఖీ చేసి పని ప్రదేశాన్ని పరిశీలించార.ు ప్రతి ఉపాధి కూలీ రూ.254 వేతనం పడేలాగా పనిచేయాలన్నారు. ఎండల అధికంగా ఉన్నందున ఉదయం పూట తొందరగా వచ్చి తొందరగా వెళ్లొచ్చు అన్నారు. అనం తరం సచివాలయాన్ని తనిఖీ చేసి సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే తగిన చర్యలు ఉంటాయని ప్రజలకు జవాబుదారితనంగా ప్రతి ఉద్యోగి పని చేయాలని ఆమె పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ విమలమ్మ పాల్గొన్నారు.

పుల్లమ్మ మృతికి వైసిపి నేతల సంతాపం

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని ముత్యాలపాడు గ్రామ వైసిపి నాయకులు, ఉపసర్పంచ్ తోట ఓబులేసు తల్లి గారైన పులమ్మ (70) గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, సంతాపం వెలి బుచ్చారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజే శారు. సంతాపం తెలిపిన వారిలో వైసీపీ నాయకులు సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్,రహమాన్,ఎంపీటీసి వెంకటరాముడు, సుబ్బరాయుడు, చాంద్‌బాష, దస్తగిరి, నరసింహ,ఓబయ్య తదితరులు ఉన్నారు.



మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

వైసిపి పాలనకు చరమగీతం

కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి



టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను అందిస్తున్న కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి - డోన్

వైసిపి పాలనకు చమరగీతం పాడాలని టిడిపి డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బేతంచెర్ల నగర పంచాయతీ 5వ వార్డు నందు బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం రాష్ట్ర ముస్లిం మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ జాకిరుల్ల బేగ్, టిడిపి పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మండల కన్వీనర్ ఉన్నాం ఎల్ల నాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మరొకసారి జగన్మోహన్ రెడ్డికి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని దివాలా తీయిస్తారని అన్నారు. కార్య క్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వర రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, భీమేష్ రెడ్డి, పట్టణ సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం సుధాకర్, నియో జకవర్గ గౌరవ సలహాదారులు కాకర్ల తిరుమలేష్ చౌదరి, బుగ్గన ఆనంద్ రెడ్డి, కె.పి భూపాల్ రెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్ , జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పిడతల రూబిన్, లోడ్డ శేఖర్, నియోజకవర్గ వాణిజ్య అధ్యక్షుడు రేగాటి భీమారెడ్డి, ఉపాధ్యక్షుడు జావాజ్ వెంకటేశ్వర్లు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముళ్ళ, మండల ఉపాధ్యక్షుడు నిజం గారి రామనాథం, కౌన్సిలర్ పూజారి రామాం జనేయులు, జనసేన నాయకులు శ్రీ కంటి మధు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షు డు టైలర్ రాముడు, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫయాజ్, గుడివాడ కృష్ణమూర్తి, ఎమ్మెస్, మధు లోకేశ్వర్ రెడ్డి, కెవి సుబ్బారెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు చంద్ర, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిమెంట్‌నగర్ రాముడు, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నాయకులతో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

వైసిపి స్పెషల్ స్టేటస్ అడగలేదు : మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

చాగలమర్రి : వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో 'స్పెషల్ స్టేటస్' కాదు కదా స్పెషల్ టీ కూడా అడగలేదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆరోపించారు. చాగలమర్రి పట్టణంలోని 18,20 వార్డుల్లో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక గుంతపాలెం వీధిలో వైసీపీ చెందిన పెద్దబికారి సాహెబ్, మహ్మద్ గౌస్,ఇంతియాజ్, సద్దాంఉసేన్, అల్తాఫ్, రఫి, ఉసేన్బాషాలతో పాటు మరో 40కుటుంబాలు మాజీ మంత్రి సమక్షంలో టిడిపిలో చేరారు. అనంతరం ఇంటింటికి తిరిగి టిడిపి , జనసేన ఉమ్మడిగా ప్రవేశపెట్టిన సూపర్ 6 పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహారెడ్డి, టిడిపి మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎస్అన్సర్ భాష, మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి నాయకులు కొలిమి ఉసేన్వలి, కొలిమి షరీఫ్, క్లస్టర్ ఇంచార్జ్ ముల్లా అజీమ్, అలంసాగారి హనీఫ్, మౌలాలి, ఖలీల్ ముళ్ళ షాబుల్ నూర్ బాషా, మదార్‌వళి,నాగూర్, గఫార్, అబ్దుల్లా,అజీం,జెట్టి నాగరాజు, జింక మదర్ వలికరిముల్లా,టైలర్ ఖాధర్,అబ్దుల్లా నాగూర్ చాంద్ బాషా రఫీ మహమ్మద్ గౌస్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ : వచ్చే ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని డోన్ టిడిపి అసెంబ్లీ అభ్యర్థి కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత రెడ్డి అన్నారు. డోన్ పట్టణంలోని 22వ వార్డులో బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ టిడిపి మిని మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల వివరా లను కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డిని గెలిపిస్తే డోన్‌ను మరింత అభివృద్ధి అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పనిరాజ్, ఓబులాపురం శేషిరెడ్డి,మద్రిరమణ, రామ్మోహన్ రెడ్డి,దిలీప్ రెడ్డి, భాష్యం శ్రీధర్ గౌడ్,మద్రి మని,ఓంప్రకాష్,రజని,ఎన్ఈ సరోజ,న్యాయవాది భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను అందిస్తున్న కోట్ల నివేదిత రెడ్డి

మద్య నిషేధంపై మాటతప్పిన ప్రభుత్వం : బిసి జనార్దన్ రెడ్డి

బనగానపల్లె : మద్యం లేకుండా చేస్తానని చెప్పి, ఇంటింటికి మద్యం సరఫరా చేస్తున్న అసమర్థ ప్రభుత్వం వైసిపి అని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. గురువారం నియోజకవర్గంలోని కోవెలకుంట్ల పట్టణంలోని గడ్డవీధిలో మాజీ ఎమ్మెల్యే బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరర రెడ్డి, నాయకులు అమడాల మద్దిలేటి, డాక్టర్ పేరా శ్రీధర్ రెడ్డి, రాజశేఖర్ మురళి తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి



గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మండల పరిధిలోని నల్లకాలువ,బాపనంతపూరం, కొత్త రామాపురం గ్రామాలలో గురువారం నాడుఅసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రూరల్ సిఐ నాగభూషణ్, ఆత్మకూరు ఎస్సై వెంకట నారాయణ రెడ్డి సమక్షంలో కేంద్ర సాయుధ బలగాల పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగభూషణ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు ర్యాలీ నిర్వహించడం జరిగింద న్నారు. ప్రజల oదరూ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించు కోవాలని సూచిం చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటావని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



4 వ విడత మెగా చెక్కను పంపిణీ చేస్తున్న దశ్యం

వైఎస్ఆర్ చేయూత మెగా చెక్కు అందజేత

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని జై కిసాన్ పార్కు నందు మెప్మా వారి ఆధ్వర్యంలో వైయస్ ఆర్ చేయూత 4వ విడత కార్యక్రమం నిర్వహి ంచి లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. ముఖ్య అతిథిలుగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ టి.సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి పాల్గొని మాట్లాడారు. చైర్మన్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. అనంతరం రూ.4 కోట్ల 96 లక్షల 50 వేల మెగా చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల మైనారిటీ జోనల్ ఇంఛార్జి అబూబక్కర్, కౌన్సిలర్‌లు అబ్దుల్ హామీద్ మియ్యా, చాంద్ బాష, షేక్ నాయబ్, లాలు ప్రసాద్, అల్లూరి క్రిష్ణ, చెరుకు సురేష్, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్క్స్ సిద్ధాంతం అజరామరం

సిపిఎం, ప్రజా సంఘాలు



మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆత్మకూర్

శ్రమ దోపిడిని నిర్మూలించాలని, దానికి వర్గ పోరాటమే ఆయుధం అని చెప్పిన కారల్ మార్క్స్ సిద్ధాంతం అజరామరం అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఏసురత్నం, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్, పాములపాడు మండల కార్యదర్శి స్వామన్న అన్నారు. గురువారం స్థానిక డాక్టర్ ఏ. ధనుంజయ మీటింగ్ హాల్ నందు కారల్ మార్క్స్ 141వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మార్క్స్ గొప్పతనం అతని పేరు, అతని పని రెండూ యుగాలకు మనుగడ సాగిస్తాయన్నారు. మానవ సమాజానికి విముక్తి మార్గం చూపించి సమాజ గతిని మార్చిన ఘనత మార్క్స్‌కే చెందుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి. వెంకటేశ్వరావు, మాబాష, పి. సుధాకర్, డి. రామ్ నాయక్, షైక్ ఇస్మాయిల్, ఎన్. స్వాములు, ఏ. సురేంద్ర, బాల యేసు, వీరన్న, కిరణ్, ఆనంద్, గణపతి, రమణ, రంగస్వామి, బ్రమ్మయ్య,దేవకుమార్, ఏసన్న, తదితరులు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** సుండీపెంట కాలనీ స్థానిక భగత్ సింగ్ కార్యాలయంలో కారల్ మార్క్స్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంద జిల్లా నాయకుడు వై. ఆశీర్వాదం కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక ఐఎఫ్టి నాయకులు వై.శీను,పి. మల్లికార్జున, షేక్షావలి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరులో గెలిచి గిఫ్టుగా ఇస్తాం

నందికొట్కూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య


ప్రజాశక్తి - నందికొట్కూరు



నందికొట్కూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేసి భారీ మెజార్టీతో గెలిపించి చంద్రబాబు నాయుడుకు గిఫ్టుగా ఇస్తామని నందికొట్కూరు నియోజ కవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య పేర్కొన్నారు. గురువారం టిడిపి విడుదల చేసిన అభ్యర్థుల రెండవ జాబితాలో తెలుగుదేశం పార్టీ నందికొట్కూరు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయ సూర్య పేరును ఖరారు చేశారు. పలువురు నేతలు టిక్కెట్ కొరకు ప్రయత్నాలు భారీగా చేసినప్పటికీ మాండ్ర శివానందరెడ్డి మద్దతు ఉన్న గిత్తా జయసూర్యకు టిక్కెట్ కేటాయించడంతో నియోజకవర్గంలో ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు అందరూ జయసూర్యను అల్లూరు గ్రామానికి చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జయసూర్య మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో నంద్యాల పార్లమెంట్ తెదేపా ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీని భారీ మెజారిటీతో గెలిపించి నారా చంద్రబాబు నాయుడుకు గిఫ్ట్‌గా ఇస్తామన్నారు. నియోజక వర్గంలో ఉన్న ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలను చేపట్టి, అధికార పార్టీ చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. పార్టీ పథకాలు మేనిఫెస్టోను ప్రజలకు వివరించి అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే దిశగా అడుగులు వేస్తామన్నారు. తనపై నమ్మకంతో టిక్కెట్ ఇప్పించిన మాండ్ర శివానందరెడ్డి, గౌరు వెంకట రెడ్డిలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని అన్నారు.

పాములపాడులో సంబరాలు

పాములపాడు : టిడిపి అధిష్టానం నందికొట్కూరు నియోజకవర్గ అభ్యర్థిగా గిత్త జయ సూర్యను ప్రకటించడంతో పాములపాడు మండల కేంద్రంలో టపాకాయలను పేల్చి నేతలు శుభాకాంక్షలు తెలిపారు. శివానందరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు తిమ్మారెడ్డి, గోవిందు, చంద్రశేఖర్, లక్ష్మీకాంత రెడ్డి, ఎన్ కృష్ణయ్య,గజ్జల భాస్కర్ రెడ్డి ,జి లింగేష్ గౌడ్ వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

మంచినీటి సమస్యను పరిష్కరించాలి : వ్యకాసం



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని సింగరాజుపల్లి చిన్న గుమ్మడాపురం గ్రామాల్లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, మండల ఉపాధ్యక్షులు పి ఏసన్న తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఈవో సుబ్రహ్మణ్యంకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరాజు పల్లి గ్రామంలో గతంలో ఇంటింటికీ డబ్బులు వేసుకొని ఎస్సీ కాలనీ ప్రజలు చెరువులో బావి తీయించారని, ఆ బావి నీళ్లనే ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా ఎస్సీ కాలనీ ప్రజలకు అందేవి ప్రస్తుతం ఆ భావి పూర్తిగా ఎండిపోయిందన్నారు. చిన్న గుమ్మడా పురం ఓవర్ హెడ్ ట్యాంకు నీళ్లను అందించే బోరు కూడా ఎండిపోయిందని, వారానికి ఒకసారి కూడా నీళ్లు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దేవకుమార్, జ్ఞాన సూర్యుడు, వెంకటరమణ, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వ పతనం ఖాయం



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

5వ పేజీ తరువాయి.. 27/23ను ఉపసంహరించుకోవాలని, చుక్కల భూములు, బంజరు భూములన్నిటికి పట్టాలు ఇవ్వాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు, నిర్వాసితులకు పూర్తి పునరావాసం, నష్టపరిహారం ఇవ్వాలని, బంజరు భూములకు కూడా చట్ట ప్రకారం పూర్తి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా సమగ్ర పంటల భీమా పథకం పెట్టాలని కోరారు. సిసిఆర్ చట్టాన్ని సవరించాలని, కౌలు రైతులకే నష్టపరిహారాలు, బీమా ఇవ్వాలన్నారు. అటవీ హక్కుల చట్టం సవరణలు ఉపసంహరించుకుని ఆదివాసుల హక్కులను కాపాడాలని కోరారు. హర్యానా బోర్డర్లో రైతులపై కాల్పులు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని, 60 సంవత్సరాలు నిండిన పేద రైతులకు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం పట్టణ కార్యదర్శి కె.మహమ్మద్ గౌస్, పట్టణ కోశాధికారి పి.వెంకట లింగం, నాయకులు సుధాకర్ రెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు రత్నమయ్య, రైతులు, కార్మికులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** రైతులు పండించే పంటలకు ఎంఎస్ స్వామినాధన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, విద్యుత్ రంగ సంస్కరణలు నిలిపివేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు మా బాష, వీరన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్‌లు అన్నారు. పట్టణంలోని సుదర్శన వర్మ భవనం నుండి ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు, కౌలు, వ్యవసాయ, కార్మిక సంఘం నాయకులు రామ్ నాయక్, రణధీర్, సామన్న, స్వాములు, ఏసేపు, ఇస్మాయిల్, సురేంద్ర, కిరణ్, బాల వెంకటయ్య, సుంకన్న, గంగాధర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక భరత్ కాంప్లెక్స్ నుండి ర్యాలీగా పొట్టి శ్రీరాములు విగ్రహం సర్కిల్‌కు చేరుకొని వ్యాకాస జిల్లా సహాయ కార్యదర్శి పి ,పకీర్ సాహెబ్ అధ్యక్షతన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా, వ్యాకాస జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు బెస్త రాజు మాట్లాడారు. నాయకులు టి.గోపాలకృష్ణ, సి నాగన్న, శ్రీనివాసులు, టి ఓబులేసు, ఎం కర్ణ, రామకృష్ణ,కొంగర వెంకటేశ్వర్లు, ఆకుల రాము, శివ రాముడు మద్దమ్మ, బొల్లెద్దుల ఏసేపు, తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరు టౌన్ : రాస్తారోకో చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా రవి కిరణ్

ప్రజాశక్తి - గడివేముల : అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా కదిరికోట రవికిరణ్ ను నియమించినట్టు స్టేట్ ఎస్సీ సెల్ చైర్మన్ సాకేశంకర్ పత్రిక ప్రకటన విడుదల చేశారు. తనను రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమించినందుకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రాష్ట్ర ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు నాగ మధు యాదవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కదిరికోట రవి కిరణ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి రాష్ట్రవ్యాప్తంగా ఎస్సి సోదరుల సమస్యల పై నిరంతరం పోరాటం చేస్తూ పార్టీకి ఎస్సీ సోదరులకు సేవ చేసుకుంటానని, పార్టీ అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వహిస్తానని అన్నారు.

నేడు సబ్ రిజిస్టర్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని నూతన సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గురువారం డోన్ పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్నటువంటి సబ్ రిజిస్టర్ కార్యాల యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కోటి రూపా యలతో నిర్మిస్తున్నటువంటి సబ్ రిజిస్టర్ కార్యాలయంకు సంబంధించిన పనులన్నీ పూర్తి అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఏఈ శ్రీకాంత్,మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్,కౌన్సిలర్ మల్లికార్జున్ రెడ్డి,కాంట్రాక్టర్ సీమసుధాకర్ రెడ్డి,సీమ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్